క్లుప్తంగా

వినుకొండ రూరల్ సీఐగా ప్రభాకర్



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ సీఐగా బి.ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా తుళ్లూరులో ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తూ వినుకొండ రూరల్‌సీఐగా బదిలీపై వచ్చారు. పట్టణంలోని రూరల్ స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐను ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పూలమాలలు, దుశబ్యూలువాలతో సత్కరించారు.

వినుకొండ కమిషనర్‌గా సుభాష్ చంద్రబోస్



వినుకొండ టౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్ చంద్రబోస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన కృష్ణవేణి నిడదవోలుకు బదిలీ కాగా, ఆమె స్థానంలో విజయ వాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సుభాష్ చంద్రబోస్ వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితోపాటు పలువురు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందచేసి, ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు 'సెంట్రల్' ప్రవేశాలు



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఏపీ మోడల్ స్కూల్ ముగ్గురు విద్యార్థులు సెంట్రల్ యూనివర్సిటీలలో ప్రవేశాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ సీఈసీ విభాగంలో వీరు ముగ్గురు ఇంటర్ పూర్తి చేశారు. ఇటీవల సెంట్రల్ యూనివర్సిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో రామావత్ జై శివనాయక్ ప్రవేశానికి అర్హత సాధించారు. అలాగే కర్నాటక రాష్ట్రంలోని సెంట్రల్ యూనివర్సిటీలో ధారా అభిషేక్ ప్రవేశం పొందగా, అనంతపురంలోని కేంద్రియ విద్యాలయంలో రాజేష్ సీటు సాధించాడు. ప్రవేశ పరీక్షల్లో విజయం సాధించిన ముగ్గురు విద్యార్థులను ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. తమ పిల్లలను తీర్చిదిద్దటంలో విద్యాబోధన చేసిన అధ్యాపక బృందాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి



వినుకొండ(నూజెండ్ల): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బీజేపీ బొల్లాపల్లి మండల నాయకుల సమావేశం పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని ఎంపీసీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ మేడం రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి బీజేపీ సభ్యత్వ కార్యక్రమాల్లో అందరూ చురుగ్గా పాల్గొని సభ్యత్వాలు చేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర వర్గ సభ్యుడు యాదాల అనిల్, జిల్లా బీజేపీ కార్యదర్శి గొడవర్తి సుజాత, జిల్లా మహిళమూ మోర్చా ఉపాధ్యక్షురా లు లక్ష్మి, రవినాయక్, రాజవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానం పునర్ నిర్మాణానికి పట్టణానికి చెందిన దప్పిలి రామమోహన్ రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు రూ.50,058లు విరాళం అందించారు. ఆలయ కార్యాలయంలో బుధవారం ఈవో టి.సుధాకరరెడ్డిని కలిసి విరాళం చెక్‌ను దాతలు అందజేశారు. తన తండ్రి దప్పిలి వెంగళరెడ్డి జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేసినట్టు దాత రామమోహన్ రెడ్డి తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఈనెల 30న అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు. వ్రతంలో పాల్గొనదలిచిన వారు ఈనెల 29వ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నలుగురు దొంగల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: రెండు నియోజకవర్గాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. చిలకలూరిపేట, జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణాల్లో పలు చోరీలకు పాల్పడుతున్న నలుగురు నిందితుల్ని అర్బన్ సీఐ రమేష్ నేతృత్వంలో ఎస్ఐ డి చెన్నకేశవులు చాకచక్యంగా పట్టుకుని బుధవారం అరెస్టు చేశారు.

పనిచేసే చోట భద్రత కల్పించాలి



మహిళలపై లైంగిక దాడులు అరికట్టాలి. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో భద్రత కల్పించాలి. మహిళలపై జరుగుతున్న అత్యాచార సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చట్టం అమలులో కఠినంగా వ్యవహరించాలి. రాత్రి వేళల్లో విధి నిర్వహణలో ఉన్న సమయంలో పూర్తిస్థాయి రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రాణాలు కాపాడే వృత్తిలో ఉన్న వైద్యులు, సిబ్బందికి మాన, ప్రాణ రక్షణ లేకపోతే విధులు నిర్వహించడం కష్టంగా మారుతోంది. కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు అమలు చేసి రక్షణ, భద్రత కల్పించేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.
– సీహెచ్.అరుణ, స్టాఫ్‌నర్స్, బొల్లాపల్లి పీహెచ్‌సీ

డాక్టర్లకు రక్షణ కావాలి



కుల, మతాలకు అతీతంగా పేషెంట్లకు వైద్యసేవలు అందజేసే డాక్టర్లకు తప్పకుండా రక్షణ కల్పించాలి. కోలకతా సంఘటన బాధాకరం. ఇటువంటివి మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలు, నిబంధనలు అమలు చేయాలి. మాకు రక్షణ ఉంటేనే పేషెంట్లకు సరైన వైద్యం అందజేయగలం.
– డాక్టర్ వంశీనాథరెడ్డి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, నరసరావుపేట

ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన

నరసరావుపేట రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు నిర్వహించే మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ నాగలక్ష్మీ తెలిపారు. జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ, రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో యల్లమంద గ్రామ సచివాలయంలో బుధవారం మీకు తెలుసా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ నాగలక్ష్మిలు పాల్గొని రెండు నెలల పాటు నిర్వహించే ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలను తెలియజేశారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపిస్తుంది, రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు లేకుండా సమాజంలో అందరితో కలిసి జీవించేలా సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో హాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్ట్ పీఎం ఉదయరాజు, ఐసీటీసీ కౌన్సిలర్ రవి, పీపీటీసీ కౌన్సిలర్ జ్యోతి, రీడ్స్ సీఎస్సీ మొహమ్మద్ గౌస్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కడియాల రమేష్, పంచాయతీ కార్యదర్శి సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు, ప్రతినిధులు

అర్హులందరికీ సంక్షేమం దరిచేరాలి

- ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని
- జనరల్ బాడీ సమావేశానికి అధికారులు హాజరుకావాలి

శావల్యాపురం: అర్హత కల్గిఉన్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు బాధ్యత వహించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి జనరల్ బాడీ సమావేశం ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుహాసిని మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో శానిటేషన్ పనులతో పాటు మౌలిక వసతులను ప్రజలకు కల్పించాలన్నారు. ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మాట్లాడుతూ 20 శాఖల అధికారులు జనరల్ బాడీ సమావేశానికి హాజరు కావల్సి ఉండగా 12 శాఖల అధికారుల హాజరు అయ్యారన్నారు. జనరల్‌బాడీ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని లేనిపక్షంలో అటువంటి వారిపై జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. నూతనంగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టే లబ్ధిదారులకు జాతీయ ఉపాధి హామీ పథకంలో 90 పనిదినాలకు గాను రూ.27 వేలు మంజూరు చేస్తామన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ ఉపాధి నిధులతో నూతనంగా 15 గ్రామపంచాయతీల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులకు రూ. ఒక కోటి 93 లక్షల అంచనాలు వేశామని త్వరలో పరిపాలన ఆమోదం పొందగానే పనులు ప్రారంభిస్తామన్నారు. మండల హౌసింగ్ ఏఈ రసూల్ మాట్లాడుతూ 2014-19 ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల పాత బకాయిలపై వచ్చే నెల నుంచి గ్రామాల్లో సర్వే చేపట్టి ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేసిన తదుపరి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి పాత బకాయిలు చెల్లింపులు చేస్తామన్నారు. ప్రధానమంత్రి అవాస్ యోజన పథకంలో 371 ఇళ్లు మంజూరు కాగా అందులో వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారులకు పెండింగ్ బకాయిలు విడుదల చేసినట్లు తెలిపారు.

నూతన హౌసింగ్ పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్న లబ్ధిదారులకు రూ. 4 లక్షల రూపాయల పథకం అమలకు ప్రభుత్వం రూపకల్పనకు చర్యలు చేపట్టిందన్నారు. ఈసమావేశంలో వైఎస్ ఎంపీపీలు నంబూరి ప్రభావతి, చెన్నంశెట్టి రంగారావు,అన్నీ శాఖల అధికారులు సర్పంచులు,ఎంపీటీసీలు, పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని

మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్

నరసరావుపేట ఈస్ట్: మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో డ్రగ్ ఫ్రీ ఇన్‌స్టిట్యూషనల్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ యువత లక్ష్యంగా మాదక ద్రవ్యాలను సంఘ విద్రోహులు సరఫరా చేస్తుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన యువతతోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. దురవాట్లకు దూరంగా ఉంటూ అభివృద్ధి పథంలో పయనించాలని విద్యార్థులకు సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాదక ద్రవ్యాలు లేని విద్యాలయాలను నిర్మిద్దామంటూ ప్రతిజ్ఞ నిర్వహింప చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు టి.వి.శంకరరెడ్డి, డాక్టర్ ఎ.సరళాదేవి, రాజనాల వేణుమాధవ్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ పీఎస్‌వీడీ మహేష్ పాల్గొన్నారు.



డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి



మాట్లాడుతున్న మాదాసు భానుప్రసాద్

చిలకలూరిపేట: పట్టణ పరిధిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, దోమల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని లోక్‌సత్తా పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భానుప్రసాద్ కోరారు. లోక్‌సత్తా కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విష జ్వరాలు తీవ్ర రూపం దాలుస్తున్న తరుణంలో ప్రజలు ఆసుపత్రుల పాలౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూడాల్సిన బాధ్యత పారిశుద్ధ్య విభాగంపై ఉందన్నారు. ప్రజలు సైతం ఇళ్ల పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ముఖ్యంగా కొబ్బరి బొండాల వ్యాపారస్తులు ప్రజలు కొబ్బరి బొండాలు తాగి పడేసాక వాటిని నాలుగు ముక్కలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మున్సిపల్ అధికారులు ఫాగింగ్, బ్లీచింగ్, దోమల మందు పిచికారి చేయాలని కోరారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

నాదెండ్ల: 3 నుంచి 30వ తేదీ వరకూ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. ప్రతి గ్రామంలోని సచివాలయాల వద్ద సదస్సులు జరగనున్నట్లు తెలిపారు. 3న ఉదయం 9 గంటల నుంచి సాతులూరు, 5న చందవరం, 10న చిరుమామిళ్ళ, 12న సంకురాత్రిపాడు, 17న గొరిజవోలు, 19న తూబాడు, 21న కనపర్రు, 24న ఇర్లపాడు, 26న ఎండుగుంపాలెం, 28న నాదెండ్ల, 30న గణపవరంలో సదస్సులు జరుగుతాయన్నా రు. సదస్సులకు అన్ని శాఖల అధికారులు హాజరౌతారని, ప్రజలు తాము ఎదుర్కొంటున్న వివిధ విభాగాలకు చెందిన సమస్యలపై నేరుగా అర్జీలు అందించవచ్చని, నిబంధనల మేరకు ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యుత్ పోరాట వీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్

నరసరావుపేట: నాటి విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజాకార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఎం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పలనాడు విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో 2000 ఏడాదిలో బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంలో అశువులు బాసిన కామ్రేడ్ బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డిల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కామినేని రామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ అమర వీరుల ఆశయాలు కొనసాగించడమే అమరవీరుల కిచ్చే నిజమైన నివాళి అన్నారు. నాడు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ బషీర్ బాగ్ వద్ద ప్రదర్శనను ప్రభుత్వం పోలీసులతో అడ్డుకుని బుల్లెట్ల వర్షం కురిపించిందన్నారు. ఆ పోరాటంలో ముగ్గురు అమరులయ్యారని, వారి త్యాగం వృథా కాలేదన్నారు. సీపీఎం నాయకులు డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, సీఐటీయూ నాయకులు షేక్ సిలార్ మసూద్, మస్తాన్‌వలి, సీపీఐ నాయకులు షేక్ సైదా, ఎంసీపీఐ (యు) జిల్లా కార్యదర్శి రెడ్ బాష, పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సమైక్యాంధ్ర ముస్లిం మైనారిటీ జేఏసీ నాయకులు షేక్ జిలాని మాలిక్ పాల్గొన్నారు.



మృతులకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

తక్కువ ఖర్చుతో నికర ఆదాయం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం

బొల్లాపల్లి : బీజామృతం కషాయంతో విత్తనశుద్ధి, నారు శుద్ధి చేయవచ్చని ఎస్ఎఫ్ఏ జిల్లా ప్రతినిధి పి.సైదయ్య తెలిపారు. ప్రకృతివ్యవసాయంపై మండలంలోని మూగచింతలపాలెం రైస్‌మిల్ కాలనీ వద్ద బుధవారం అవగాహన కల్పించారు. స్వయంసహాయక గ్రూపులు, కాలనీలో రైతులకు బీజామృతం తయారు చేసే విధానాన్ని చేసి చూపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఏ జిల్లా ప్రతినిధి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక రాబడి ద్వారా వ్యవసాయంలో లాభాలు ఆర్జించే విధంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో సున్నా పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. బీజామృత కషాయంతో భూమి నుంచి వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కషాయాన్ని 5 కేజీల పేడ, 5 లీటర్ల దేశీ ఆవు మూత్రం, చిటికెడు సున్నం, 100 లీటర్ల నీళ్లతో తయారు చేసుకోవచ్చని డెమో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ఆచరించడం ద్వారా ఖర్చు తగ్గడంతో పాటు నికర ఆదా యం పెరుగుతుందని, ఆరోగ్యకరమైన ఆహారం పొందవచ్చని సూచించారు. యూనిట్ ఇన్‌చార్జి వేణుగోపాల్, నాసర్‌బాబు, పుల్లారావు, దానయ్య, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



బీజామృతం తయారు చేసి చూపుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉత్తమ క్రీడా ప్రదర్శన పాఠశాలలు

నరసరావుపేట ఈస్ట్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడుజిల్లా పరిధిలో ఐదు పాఠశాలలను అత్యుత్తమ క్రీడా ప్రదర్శన పాఠశాలలుగా ఎంపిక చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సి.హెచ్.కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఎంపికైన వాటిలో ఏఎంజీ పాఠశాల (చిలకలూరిపేట), జడ్పీ హైస్కూల్ (నందిగామ, సత్తెనపల్లి మండలం), జడ్పీ హైస్కూల్ (పసుమర్రు), జడ్పీ హైస్కూల్ (సుగాలి, సత్తెనపల్లి), జడ్పీ హైస్కూల్ (శావల్యాపురం) ఉన్నాయన్నారు.

విజయలక్ష్మిని అభినందించిన ఉపాధ్యాయులు

శావల్యాపురం: ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన పేద విద్యార్థిని అర్థిక చేయూత అందించటం మంచి శుభపరిణామమని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని కనమర్లపూడి గ్రామానికి చెందిన ఉప్పు బసవరాణి తన చిన్నతనంలో తండ్రిని కోల్పోయింది. తన కుటుంబ సభ్యుల సహకారంతో పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జాతీయ, రాష్ట్రస్థాయిలో బాల్ బాడ్మింటన్ క్రీడా విభాగంలో మంచి ప్రతిభ చూపటంతో పాటు సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఉప్పు బసవరాణి 6వ తరగతి నుంచి క్రీడల్లో రాణిస్తూ 10 రాష్ట్ర స్థాయి పోటీల్లో జూనియర్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జట్టు తరుపున బీహార్ రాష్ట్రంలో జరిగిన పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించి అందరి మన్ననలు పొందినట్లు ప్రధానోపాధ్యాయురాలు వెల్లడించారు. క్రీడా కోటాలో భాగంగా 500 మంది ట్రిపుల్ ఐటీలో దరఖాస్తులు చేసుకోగా రాష్ట్రస్థాయిలో 20 మంది విద్యార్థునులే ఎంపిక కావటం అందులో 6వ స్థానంలో బసవరాణి ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఐక్యంగా విరాళాలు రూపంలో సేకరించిన రూ.15 వేలు నగదు విద్యార్థిని ఉప్పు బసవరాణికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరాజు, శ్రీకాంత్, నిర్మల పాల్గొన్నారు.



ఉప్పు బసవరాణికి అర్థిక చేయూత అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎరువుల అమ్మకాలు పారదర్శకంగా జరగాలి

ఏడీఏ రవిబాబు

శావల్యాపురం: ఖరీఫ్‌లో వరి పంట సాగు రైతులకు యూరియా, డీఏపీ ఎరువులు కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సొసైటీలో గోదాంలో ఎరువుల నిల్వలతో పాటు రికార్డులు వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మండలంలోని అన్నీ రైతుసేవా కేంద్రాలు, ప్రైవేటు దుకాణాలు, సొసైటీల్లో 266 టన్నులు యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. డీఏపీ 110 టన్నులు ఉందన్నారు. అన్నీ రకాల ఎరువుల 725 మెట్రిక్ టన్నులు ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నట్లు ఏడీఏ తెలిపారు. సెప్టెంబరు నెలలో ముమ్మరంగా వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయని ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ఉండటంతో పాటు ఎంఆర్‌పీ ధరలకు ఎరువుల అమ్మకాలు నిర్వహణపై నిరంతరం వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేస్తారన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులకు తావులేకుండా అమ్మకాలు పారదర్శకంగా జరిగేలా కొనుగోలు చేసిన ప్రతిరైతు బిల్లు పొందాలని అలాగే అమ్మకాలు చేసే వారందరూ ఈ-పాస్ యంత్రపరికరాల ద్వారా బయోమెట్రిక్ విధానంలో నిర్వహించాలన్నారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు, రైతులు పాల్గొన్నారు.



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

సౌత్‌జోన్ యోగాసన పోటీలకు ఎన్ఈసీ విద్యార్థిని

నరసరావుపేటరూరల్: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఈఈఈ విభాగం నాల్గవ సంవత్సరం విద్యార్థి డి.నాగాంజలి సౌత్‌జోన్ యోగాసన పోటీలకు ఎంపికై నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈనెల 18వతేదీన రాజమండ్రిలో యోగసనా భారత్ అసోసియేషన్ నిర్వహించిన మహిళ కేటరిగిలో రాష్ట్ర జట్టుకు నాగాంజలి ఎన్నికై నట్టు తెలిపారు. ఆగస్టు31, సెప్టెంబర్1 తేదీలలో తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లిలో జరుగనున్న సౌత్‌జోన్ పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. యోగాసన పోటీలలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన నాగాంజలిని కళాశాల ఈఈఈ విభాగాధిపతి షేక్ షరీఫ్, వ్యాయమ అధ్యాపకుడు ఎల్.కృష్ణారెడ్డి, ఎస్.ఆంజనేయులు, ఏవో శ్రీధర్ తదితరులు అభినందించారు.



నాగాంజలిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, వ్యాయామ అధ్యాపకులు

చోరీ కేసులో ఇరువురు నిందితుల అరెస్ట్

నరసరావుపేటరూరల్: కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని టిడ్కో భవన సముధాయంలో చోరీ కేసును పోలీసులు చేధించారు. కేసు వివరాలను బుధవారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రూరల్ ఎస్ఐలు సి.హెచ్.కిశోర్, ప్రియాంకలు తెలియజేశారు. ఈనెల 25వ తేదీన టిడ్కో సముదాయంలోని రెండవ అంతస్తులో నివసిస్తున్న షేక్ చాగల్లు రియాజ్ అహమ్మద్ నివాసంలో చోరీ జరిగింది. తాళాలు పగులకొట్టిన ఇంటిలోకి ప్రవేశించిన దుండగులు బీరువాను సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు తీసుకువెళ్లి వెండి, బంగారు వస్తువులు, రూ.80వేల నగదును అపహరించాఅరు.

బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రూరల్ ఎస్ఐ సి.హెచ్.కిషోర్ దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన సత్తెనపల్లిరోడ్డు సీబీఎన్ కాలనీకి చెందిన మొగిలి మహేష్, దప్పుతోళ్ల వెంకట్రావులను చిలకలూరిపేట రోడ్డు ఎస్ఆర్‌కెటి రోడ్డు జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ముద్దాయి నాగభూషణం పరారీలో ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు.



మీడియా సమావేశంలో నిందితులతో రూరల్ ఎస్ఐలు కిషోర్, ప్రియాంకలు

ఆదివాసి హక్కుల పోరాట సదస్సు జయప్రదం చేయాలి

సదస్సు కరపత్రం ఆవిష్కరించిన పీడీఎం నాయకులు

నరసరావుపేట: ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటిన నెల్లూరు పట్టణంలోని టౌన్ హాలులో ఉదయం 10 గంటలకు నిర్వహించే దక్షిణ కోస్తా ప్రాంతీయ సదస్సు జయప్రదం చేయాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణ శివారు అష్ఫాకుల్లా ఖాన్ కాలనీలో కరపత్రాలు ఆవిష్కరించారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ మధ్యభారతం, మణిపూర్, కాశ్మీర్ తదితర ప్రాంతాల్లో సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. దీనిని అడ్డుకునే ఆదివాసులపై ముప్పేట దాడులకు పాల్పడుతూ, ఒక్క మధ్య భారతంలోనే జనవరి నుంచి నేటి వరకు 200 మంది ఆదివాసులు, ఉద్యమకారులను చంపేశారన్నారు. దేశ ప్రజలకు చెందాల్సిన సహజ వనరులు, పాలకవర్గాలు కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై, వారితో ఒప్పందాలు చేసుకుని, వాటిని అమలు చేయడం కోసం పెద్ద ఎత్తున వివిధ రకాల సైనిక బలగాలతో ఆదివాసులను ఖాళీ చేయించడం, ఖాళీ చేయకపోతే దాడులు చేయటం, అప్పటికీ లొంగకపోతే భౌతిక నిర్మూలనకు పాల్పడటం పాలకులు ఒక విధానంగా పెట్టుకున్నారన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ దేశంలో వివిధ ప్రాంత ఆదివాసులు పోరాడుతున్నారని, వారికి సంఘీభావంగా సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కార్యకర్త టి.రమణయ్య, న్యాయవాది సిద్ధార్థ దొర, సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం, ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్, కో కన్వీనర్ జువ్విగుంట బాబు పాల్గొంటారని చెప్పారు. కరపత్రం ఆవిష్కరణలో పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శిఖినం చిన్న పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న పీడీఎం నాయకులు, కాలనీ వాసులు

నాసిరకం విత్తనాలతో నష్టపోయిన అన్నదాతలు

వినుకొండ(నూజెండ్ల): నాసిరకం విత్తనాలు వలన మోసం పోయిన రైతులు వ్యథా అంతా ఇంతా కాదు. వ్యవసాయ సీజను ప్రారంభం కావటంతో అన్నదాతలు వరి నారుమడులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఈక్రమంలో శావల్యాపురం గ్రామానికి చెందిన ముట్లూరి బాలస్వామి అనే రైతు వినుకొండ పట్టణంలోని స్తూపం సెంటరు పరిధిలోని విజయలక్ష్మి సీడ్స్ ఏజెన్సీ వద్ద జేవిఎల్ కంపెనీకు చెందిన 384 వరి రకం విత్తనాలు కొనుగోలు చేసి నారుమడిని సాగు చేయగా ఎటువంటి మొలక ఎత్తలేదని వాపోయారు. ఇలాగే గ్రామానికి చెందిన కొందరు రైతులు ఇదే షాపులో విత్తనాలు కొనుగోలు చేసి నారుమడి సాగు చేయగా ఆ నారుమడులు పరిస్థితి ఇదే విధంగా అయిందని అన్నదాతలు వాపోయారు. ఈవిషయం గురించి దుకాణ యజమాని అడుగగా ఎలాంటి స్పందన లేదని తీవ్రస్థాయిలో అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి సంబంధిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వారంతా కోరుతున్నారు.